

పట్టువస్త్రాల బహూకరణ

అన్నవరం: రత్నగిరిలోని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, ఇతర దేవతామూర్తుల అలంకరణకు అయ్యన్నదొర 15 పట్టు పంచెలు, 15 పట్టు చీరలు సమర్పించారు.




సేవకు చిరునామా స్వర్ణాంధ్ర

సమాజంలో అవసరార్థులకు సేవలు అందించడంలో స్వర్ణాంధ్ర సేవాసంస్థ ముందంజలో ఉంది. శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుక జరుపుకోనుంది.

- 8లో▸

డెల్టాలకు నీరు



రాజమహేంద్రవరం రూరల్: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

రవాణా క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఆ శాఖ అధికారులు

అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణా శాఖ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ 2023 సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం ఆవిష్కరించారు. అనంతరం మంత్రికి ఆ శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని ఘనంగా సత్కరించి అభినందించారు. రవాణా శాఖ అమలాపురం డీటీవో డి.అశోక్ ప్రతాపరావు, ఎంవీఐలు ఆర్.సురేష్, డీఎస్ఎస్ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమలాపురం పట్టణం 9వ వార్డుకు చెందిన ముత్యాల దత్త సాయికృష్ణ అనే బాలుడికి నూతనంగా మంజూరైన దివ్యాంగ పెన్షన్‌ను మంత్రి విశ్వరూప్ అందజేశారు. మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన శ్రీనివాస్, మంగళంపల్లి అంజిబాబు, దూడల ఫణి పాల్గొన్నారు.

వెంకన్నకు వెండి కవచం



కవచధారుడైన వేంకటేశ్వరుడు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటి వారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన గొలకోటి వెంకట్ మణి కుమారి దంపతులు రూ.2.25 లక్షలు విలువైన వెండి కవచంను గురువారం అందజేశారు. బండారువారివీధికి చెందిన బండారు సత్యనారాయణ (అబ్బు) రూ.30 వేలు విలువైన వెండి ఆభరణాలను స్వామివారికి సమర్పించారు. పంచ పీఠం, వెండి ఆభరణాలను తొలుత ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

రథోత్సవానికి సన్నాహాలు



షెడ్డు నుంచి వెలుపలికి తెచ్చిన రథం

సఖినేటిపల్లి: అంతర్వేది రథాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలోని రథం షెడ్డు నుంచి వెలుపలికి తీసుకువచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సారథ్యంలో పల్లిపాలెం అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు, స్థానిక భక్తులు రథాన్ని ప్రాంగణంలోకి తెచ్చారు. రానున్న ఉత్సవాలకు రథాన్ని సిద్ధం చేసేందుకు వెలుపలికి తెచ్చినట్టు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

యువతులకు ఉచిత ఉపాధి శిక్షణ

మామిడికుదురు: భగవాన్ శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా మహిళలకు ఫిబ్రవరి మొదటి వారంలో ఉపాధి కల్పన కోసం ఉచితంగా శిక్షణ ఏర్పాటు చేశామని శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు గురువారం తెలిపారు. జగన్నపేట శ్రీసత్యసాయి సేవా సంస్థ, హైదరాబాద్‌కు చెందిన గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సౌజన్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జగ్గన్నపేట శ్రీసత్యసాయి కల్యాణం మంటపంలో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. 19 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్న 10వ తరగతి చదువుకున్న మహిళలకు మగ్గం, శారీ బ్లౌజ్ డిజైనింగ్‌పై 40 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ ఇస్తామని చెప్పారు. శిబిరంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 25వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పేర్ల నమోదుకు 88979 87388, 94407 65635 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళా ఓటర్లదే పైచేయి





- జిల్లా ఓటర్ల తుది జాబితాలో వారే ఎక్కువ
- పురుషుల కంటే 4,870 మంది అధికం
- జిల్లా ఓటర్ల సంఖ్య 14,84,485
- పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,641

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు తుది ఓటర్ల జాబితా సిద్ధమైంది. కొత్త జిల్లా ఏర్పడ్డాక తాజా ఓటర్ల సంఖ్య నిర్ధారణ చేస్తూ తుది జాబితా విడుదలైంది. తాజా జాబితా ప్రకారం జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 14,84,485 మంది ఉంటే అందులో 4,870 మంది ఎక్కువగా మహిళా ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 7,39,975 మంది ఉంటే మహిళా ఓటర్లు 7,44,665 మంది ఉన్నారు. ఇతరుల ఓటర్లు 25 మంది ఉన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు రెవెన్యూ డివిజన్లు, 22 మండలాలు, 385 గ్రామాలకు సంబంధించి మొత్తం 1,641 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి నిర్ధారణ చేశారు.

ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రత్యేక సంక్షిప్త సవరణ-2023 షెడ్యూల్ ప్రకారం గురువారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో, ఎలక్టోరల్ అధికారి, సహా ఎలక్టోరల్ అధికారి కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో ప్రచురణ, ప్రదర్శన చేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట ఆర్డీవోలు గురువారం విడుదలైన ఓటర్ల తుది జాబితాలను పరిశీలించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలోని మొత్తం ఓటర్లు 14,84,782 మంది ఉంటే తుది జాబితాలో 14,84,485 మంది అన్నారు. అంటే తుది జాబితాకు వచ్చేసరికి 297 ఓట్లు తగ్గాయి.



తాజాగా ప్రకటించిన ఓటర్లు (నియోజకవర్గాల వారీగా)

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
రామచంద్రపురం	239	99,602	99,886	7	1,99,4953
ముమ్మిడివరం	286	1,17,313	1,16,917	2	2,34,232
అమలాపురం	234	1,02,549	1,02,302	1	2,04,852
రాజోలు	205	94,127	95,653	2	1,89,782
గన్నవరం	212	97,235	95,104	2	1,92,341
కొత్తపేట	262	1,24,086	1,24,899	8	2,48,993
మండపేట	221	1,04,883	1.09,904	3	2,14,790
మొత్తం	1,641	7,39,795	7,44,665	25	14,84,485

లక్ష్మీనృసింహుని ఆదాయం రూ.37,57,532



హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహునికి భక్తుల నుంచి వివిధ హుండీల ద్వారా రూ.37,57,532 ఆదాయం వచ్చింది. ఆలయంలో అప్పనపల్లి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీ నాగవరప్రసాదరావు పర్యవేక్షణలో అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. 81 రోజులకుగాను మెయిన్ హుండీ ద్వారా రూ.36,56,748, అన్నదానం హుండీ ద్వారా రూ.71,456, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.29,328 ఆదాయం చేకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

ఈఎస్ఐ కోసం రూ.12 కోట్లు మంజూరు

ఎంపీ వంగా గీత

కాకినాడ: ఈఎస్ఐ ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మూడు ఆపరేషన్ థియేటర్లు, ఇతర వసతులు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ వంగా గీత చెప్పారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కార్మికులు,వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.100 కోట్లతో కాకినాడలో అత్యాధునిక ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణమవుతోందన్నారు. ఆపరేషన్ థియేటర్‌తోపాటు మెడికల్ గ్యాస్ పైపులైన్, స్టెరయిల్ సిస్టమ్ కోసం ఆపరేషన్ థియేటర్లు, లాండ్రీ పరికరాలు ,విద్యుత్ అంతరాయం లేకుండా మిషనరీ, నాన్ మెడికల్ ఫర్నీచర్ కోసం ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి త్వరితగతిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఇటీవల కేంద్ర కార్మిక, ఉపాధి శాఖామంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిధులు మంజూరయ్యాయన్నారు.

తుఫాన్ భవనాలను సంరక్షించాలి



మహిళలకు సూచనలు చేస్తున్న అంబేద్కర్

ఉప్పలగుప్తం: తుఫాన్ రక్షిత భవనాలను సంరక్షించే బాధ్యత స్థానిక మహిళా సంఘాలదే అని రాష్ట్ర విపత్తుల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి రాఘవులపేటలో ఉన్న తుఫాన్ రక్షిత భవనాన్ని గురువారం ఆయన పరిశీలించి, మహిళా శక్తి సంఘాల సభ్యులకు సచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో 275 తుఫాన్ రక్షిత భవనాలు ఉన్నాయని తెలిపారు. వీటి నిర్వహణకు స్థానికంగా ఉన్న మహిళా సంఘాల ఖాతాల్లో రూ.5 లక్షలు జమ చేస్తున్నామన్నారు. దానిపై వచ్చే ఆదాయంతో మహిళలు ఈ భవనాలను పరిశుభ్రంగా ఉంచకోవాలన్నారు. ఆర్డీవో వసంత రాయుడు, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, అంగాని సాంబశివరావు, కొంకి రాజారావు, ఓలేటి గౌరమ్మ, చింతా నాగలక్ష్మి, లంకే భాగ్యలక్ష్మి, మల్లాడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

- సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ఆత్మీయ సమావేశంలో మంత్రి విశ్వరూప్



ఇందుపల్లిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ సీపీ తరఫున నియమితులవుతున్న ముగ్గురేసి కన్వీనర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణ, రూరల్ గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ఆత్మీయ సమావేశం గురువారం మంత్రి విశ్వరూప్ అధ్యక్షతన జరిగింది. మంత్రి మాట్లాడుతూ భవిష్యత్‌లో నగరాలు, పట్టణాలు గ్రామాల్లో ఈ కన్వీనర్లు, గృహ సారథుల వల్ల క్షేత్ర స్థాయి అభివృద్ధి మరింత బలోపేతం అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడం ద్వారా సచివాలయ వలంటీర్ల వ్యవస్థకు మరింత మేలును సాధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు మెరుగైన సేవలు అందిస్తున్న వలంటీర్ల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని అన్నారు. నవరత్నాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు కృషి అభినందనీయమని, కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం వలంటీర్ల వ్యవస్థని మెచ్చుకున్నారని తెలిపారు. గుజరాత్‌లో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నారన్నారు. నూతనంగా నియమితులైన కన్వీనర్లు, వలంటీర్లతో సమన్వయం చేసుకొని పని చేయాలని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పౌరసేవలను ఇంటి వద్దకే అందించడంతో పాటుగా 1.40 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 2.40 లక్షల వలంటీరు నియమకాలు చేసిన ఘనత సీఎం జగన్‌దని మంత్రి అన్నారు. 50 కుటుంబాలకు వలంటీర్‌తో పాటుగా ఇద్దరు గృహ సారథులను నిమిమించి సంక్షేమ పథకాలపై పర్యవేక్షిస్తుంటారన్నారు. పార్టీ పరిశీలకుడు అల్లి రాజబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గృహ సారథులు కీలక పాత్ర పోషించవలసి ఉందన్నారు. వలంటీర్ల పరిధిలో ఇద్దరు గృహ సారథులు స్వచ్ఛందగా పార్టీ కోసం పని చేయాలని అన్నారు. పట్టణ మండల పార్టీల అధ్యక్షులు సంసాని చంద్రశేఖర్ (నాని) బొంతు గోవిందశెట్టి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడిపూడి వెంకటేశ్వరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రూరల్ ప్రధాన కార్య దర్శి సూదా గణపతి, డీసీసీబీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, వైస్ ఎంపీపీలు పాలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సహకార సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

రబీ నాట్లు పూర్తయ్యాక ఈ-క్రాప్ బుకింగ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా. పక్కన జేసీ ధ్యాన చంద్ర

కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన

అమలాపురం టౌన్: జిల్లాలో రబీ నాట్లు పూర్తయిన వెంటనే ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ జరగాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి 26 జిల్లాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర, అన్ని ప్రభుత్వ జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆ కాన్ఫరెన్స్ పూర్తయ్యాక పలు ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై కలెక్టర్ శుక్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల అభ్యున్నతి అమలు ఆశించిన స్థాయిలో ఉన్నప్పటికీ వారి సుస్థిర జీవనోపాధి కల్పన దిశగా మరింత వేగంగా ముందడుగు పడాలని సూచించారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న తోడు కార్యక్రమాల ద్వారా డీఆర్‌డీఏ, మెప్మా శాఖలు, బ్యాంకర్లు సమన్వయంతో ఆదాయ వనరులు పెంపొందే రంగాల్లో అర్హత గల సమైక్య సంఘాలకు పెట్టుబడి అందించి సుస్థిర ఆదాయ కల్పనకు పాటుపడాలని ఆయా పథకాల పర్యవేక్షణ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, క్రిమి సంహారిక మందులు సరఫరా చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. స్పందన, గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వే తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి ఆయా శాఖల అధికారులకు మార్గ నిర్దేశకాలు వివరించారు. డీపీవో వి.కృష్ణకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, గృహ నిర్మాణ శాఖ పీడీ సీహెచ్ బాబూరావు, డీఆర్‌డీఏ పీడీ వి.శివ శంకరప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సత్యవాణితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యంగా పది పరీక్షా కేంద్రాలు

ముమ్మిడివరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అసౌకర్యాలకు తావులేని పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ సూచించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి సమావేశపు హాలులో గురువారం జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.రమణశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఈవో రవిసాగర్ మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పది పరీక్షా కేంద్రాల ఎంపికలో విద్యార్థులకు తాగునీరు, డెస్కులు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలతో పాటుగా ప్రహరీలు ఉండే పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. పది పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏ,బీ కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. అనంతరం విద్యాశాఖ ఏడీ వి.విజయలక్ష్మి పది పరీక్షా కేంద్రాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీవైఈవో షాలెంరాజు, ఏఎస్‌వో తాతారావు, ఏపీవో ఆదినారాయణ, వివిధ మండలాలకు చెందిన ఎంఈవోలు పాల్గొన్నారు.



పది పరీక్షా కేంద్రాల ఎంపికపై సమీక్ష చేస్తున్న విద్యాశాఖ ఏడీ విజయలక్ష్మి

రిటర్న్ టు హోం

- ఇతర డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి మోక్షం
- కొత్త జిల్లాల ఏర్పాటుతో వెనక్కి రప్పిస్తున్న పోలీసు శాఖ
- ఇతర శాఖల్లో ఐదేళ్లు పైబడి పనిచేస్తున్న వారి వివరాల సేకరణ



అమలాపురం టౌన్: కొత్త జిల్లాల్లో పోలీసు శాఖ పరంగా కొన్ని మార్పులు, సర్దుబాట్లు, ఒకే చోట పనిచేస్తున్న వారిని వెనక్కి రప్పించి.. వేరే వారిని పంపించే ప్రయత్నాలకు ఆ శాఖ శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా పోలీసుశాఖలోనే ఇతర డిపార్ట్‌మెంట్లలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని గుర్తించే ప్రక్రియకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారిని ఆయా శాఖల నుంచి రప్పించి వారి స్థానే వేరే వారిని పంపించేందుకు చర్యలు చేపడుతోంది. తొలుత ఇతర డిపార్ట్‌మెంట్లో అయిదేళ్లు దాటి పనిచేస్తున్న అధికారులను పేరెంట్ డిపార్ట్‌మెంట్ అయిన లా అండ్ ఆర్డర్ డిపార్ట్‌మెంట్‌కు రప్పించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఈ నెల రెండో తేదీన ఆయా జిల్లాల ఎస్పీ కార్యాలయాలకు ఉత్తర్వులు అందాయి. దీని ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇతర డిపార్ట్‌మెంట్‌ల్లో పనిచేసే వివరాలను పోలీసుశాఖ సేకరించనుంది. పోలీసు శాఖలోనే పనిచేస్తూ ఇతర డిపార్ట్‌మెంట్లు అయిన సీఐడీ, ఏసీబీ, విజిలెన్స్, స్పెషల్ బ్రాంచి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రైల్వే, ట్రాన్స్‌కో విజిలెన్స్, మెరైన్, ఆర్మ్‌డ్, ఏపీఎస్పీ, రోడ్డు సేఫ్టీ తదితర డిపార్ట్‌మెంట్లకు అటాచ్‌మెంట్ లేదా డిప్యుటేషన్‌పై కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయా డిపార్ట్‌మెంట్లలో అయిదేళ్ల కిందట నియమితులయ్యారు. అయితే వీరు అప్పటి నుంచి అదే డిపార్ట్‌మెంట్‌ల్లో ఒకే చోట పనిచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉన్నప్పుడు పలు డిపార్ట్‌మెంట్లకు అనేకమంది పోలీసు అధికారులను అటాచ్‌మెంట్, డిప్యూటేషన్ పేరుతో ఆయా శాఖలకు నియమించారు. పోలీసు పరి భాషలో ఈ తరహా అటాచ్‌మెంట్, డిప్యుటేషన్లను లూప్‌లైన్ డిపార్ట్‌మెంట్లలో పనిచేయడం అంటారు. ఇప్పుడు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక వారికి ఏళ్ల తరబడి డిప్యుటేషన్లు, అటాచ్‌మెంట్ల నుంచి విముక్తితో కొత్త సర్దుబాట్లు, నియమాకాలకు తాజాగా చర్యలు చేపట్టనున్నారు. కోనసీమ జిల్లాలో ఈ తరహాలో పలు డిపార్ట్‌మెంట్లకు సంబంధించి దాదాపు 80 మంది పనిచేస్తున్నట్లు సమాచారం. ఇలా వెనక్కి రప్పించిన పోలీసు అధికారులకు పేరెంట్ డిపార్ట్‌మెంట్ అయిన లా అండ్ ఆర్డర్‌లో పోస్టులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇతర డిపార్ట్‌మెంట్లకు అటాచ్‌మెంట్, డిప్యుటేషన్‌పై వెళ్లి అయిదేళ్లు దాటి పనిచేస్తున్న అధికారులకు ఒక రకంగా పోలీసుశాఖ మోక్షం కల్పించనుంది.

క్లుప్తంగా

క్వారీల్లో కొనసాగిన తనిఖీలు

రౌతులపూడి: కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గత రెండురోజులుగా ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం, తిరుపతమ్మపేట, ములగపూడిలోని నల్లరాయి క్వారీలో చేపట్టిన తనిఖీలు గురువారం కొనసాగాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారుల సంయుక్త బృందం ఈ తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కాకినాడ మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పలు క్వారీలను గుర్తించామన్నారు. వీటిపై సమగ్ర పరిశీలన జరిపి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తుని రూరల్ సీఐ సన్యాసిరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విష్ణువర్ధనరావు, ఏజీ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ షేక్ బాబ్జి, సర్వేయర్ గోవింద్, కోటనందూరు పోలీసులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

మామిడికుదురు: కొమరాడకు చెందిన శృంగవరపు విజయదుర్గను అదనపు కట్నం కోసం వేధిస్తున్న నేరంపై అతని భర్త శ్రీనివాస్‌తో పాటు అత్త సారాదేవిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. రాజోలు ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నమోదు చేశామన్నారు. కొమరాడకు చెందిన విజయదుర్గకు సఖినేటిపల్లి మండలం రామేశ్వరానికి చెందిన శ్రీనివాస్‌తో 2011 నవంబర్ 19వ తేదీన వివాహం జరిగిందన్నారు. అప్పట్లో కట్నం రూపేణా రూ.నాలుగు లక్షలు నగదు, అయిదు కాసులు బంగారం ఇచ్చారని చెప్పారు. విజయదుర్గ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారని చెప్పారు. 2021వ సంవత్సరం జనవరిలో సంక్రాంతి పండగకు విజయదుర్గను భర్త శ్రీనివాస్ కొమరాడలో పుట్టింటి వద్ద దించేసి గల్ఫ్ వెళ్లిపోయాడన్నారు. అప్పటి నుంచి తనను అత్తింటికి రాకుండా భర్త, అత్త అడ్డుకుంటున్నారని, అత్తింటికి వెళ్లగా తనపై దాడి చేశారని, రూ.రెండు లక్షలు అదనపు కట్నం తీసుకు రావాలని తనను వేధించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై జానీబాషా తెలిపారు.

సేవకు చిరునామా స్వర్ణాంధ్ర

- మానవత్వం చాటుతూ ప్రయాణం
- నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులకు సేవలు అందించడంలో స్వర్ణాంధ్ర సేవాసంస్థ ముందంజలో ఉంది. సేవామార్గంలో చిన్నగా ప్రారంభించిన ప్రయాణం నేడు బహుముఖ సేవలు అందించే స్థాయికి చేరుకుంది. పేదలకు పలు సేవా కార్యక్రమాలు అందిస్తూ రాజమహేంద్రవరంలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధమైంది. 1998లో మొదలైన ఈ సేవా ప్రయాణం శుక్రవారం నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

ప్రజల సేవలో..

సామాజిక సేవలతో అడుగులు మొదలు పెట్టిన స్వర్ణాంధ్ర సంస్థ.. కాలక్రమేణా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది. మహిళలు, బాలలు, యువత, వృద్ధుల భవిత కోసం వృద్ధాశ్రమం, కుట్టు శిక్షణ కేంద్రం, పేద పిల్లలకు ట్యూషన్ సెంటర్, ఉచిత కంప్యూటర్ సెంటర్, కెరీర్ గైడెన్స్, వలంటీర్ ఇంటర్న్‌షిప్, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులు, చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ, నిరుపేదలకు దుస్తుల పంపిణీ తదితర వాటిని నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు వలస కూలీలు తమ స్వగ్రామాలకు కాలినడకన ప్రయాణం చేస్తున్న సమయంలో జాతీయ రహదారిలో నిత్యం వందల మందికి భోజన సదుపాయం కల్పించింది. వారికి పాదరక్షలు అందించి మానవత్వాన్ని చాటుకుంది.



కరోనా వేళ వలస కూలీలకు భోజనం అందిస్తూ...



వృద్ధాశ్రమంలో సేవలు

1998లో ప్రారంభం

1998లో స్వర్ణాంధ్ర కల్చరల్ అసోసియేషన్ పేరుతో ఏర్పడినప్పటికీ కార్యక్రమాలు పెరడగంతో పాటు సమాజానికి మరింత సేవ చేయాలనే నిర్వాహకులు తలంపుతో స్వర్ణాంధ్ర సేవా సంస్థగా మారింది. అనేక సేవ, సంక్షేమ కార్యక్రమాలను అందించసాగింది. లాలాచెరువు ఏరియాలో ప్రధానంగా మూడంతస్తుల సొంత భవనం ఏర్పాటు చేసుకోగలిగింది. నిత్యం వందమంది వృద్ధులతో సంరక్షణ కేంద్రం కొనసాగుతోంది. ప్రతిరోజూ దాతల సాయంతో సుమారు 650 మందికి స్వర్ణాంధ్ర సేవాసంస్థ అన్నదానం చేస్తోంది.

ఉపాధి కల్పనా కేంద్రం

స్వర్ణాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, వేలమందికి జీవనోపాధికి బాటలు వేశారు. ఈ సేవలకు గుర్తింపుగా హీరో మోటార్స్ సంస్థ నుంచి డాక్టర్ గుబ్బల రాంబాబు నయా ఇండియా కా కోజ్ అవార్డు అందుకున్నారు. విద్యార్థులతో పాటు మహిళలు, పురుషులకు ఉపయోగపడేలా కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. పేద పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు.



అవార్డు అందుకుంటున్న సంస్థ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ గుబ్బల రాంబాబు

అన్న సమారాధన

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫీడ్ ద హంగర్ నినాదాన్ని ఆచరణలో చూపేందుకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు 400 మందికి అన్నదానం చేస్తున్నారు. గత 452 రోజులుగా నిర్విరామంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

అందరి సహకారంతోనే..

నా ఆలోచనలకు, ఆశయాలకు సహకరించే స్నేహితులు, నగరంలోని సేవా మూర్తులు, దాతల సాయంతోనే స్వర్ణాంధ్ర సంస్థ ద్వారా నిరంతరం సేవలు అందించగలుగుతున్నాం. 25 ఏళ్ల సేవలు అందించిన సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకను శుక్రవారం ప్రముఖుల సమక్షంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

– లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకులు

కిలేడిపై కేసు నమోదు

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు రూ.లక్షల్లో టోకరా

పిఠాపురం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పిఠాపురానికి చెందిన ఒక మహిళ పలువురు నిరుద్యోగులను దోచుకున్న సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై జగన్మోహన్ కథనం ప్రకారం పిఠాపురం వైఎస్సార్ గార్డెన్స్‌లో నివాసముంటున్న కట్టు శిరీషకుమారి తనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రముఖులు పరిచయస్తులని, అన్ని ప్రభుత్వ శాఖలలోను ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించింది. తాను ప్రముఖులతో తీయించుకున్న ఫొటోలను చూపించడంతో నమ్మిన నిరుద్యోగులు ఒక్కొక్కరు రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆమెకు ఇచ్చారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, శ్రీకాకుళం విజయనగరం, ఇతర రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులు ఈమెకు ఉద్యోగాల కోసం భారీగా ముట్టజెప్పారు. నెలలు గడుస్తున్నా ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన నిరుద్యోగులు ఇటీవల ఆమెను గట్టిగా నిలదీయగా నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు చూపించి త్వరలోనే మీకు వస్తాయంటూ నమ్మబలికింది. కాని ఎంతకూ ఉద్యోగాలు రాకపోవడంతో గురువారం పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేయడంతో ఆమెపై, ఆమెకు సహకరించిన పిఠాపురానికి చెందిన శ్రీను అనే కానిస్టేబుల్ (ప్రస్తుతం సామర్లకోట పోలీసు స్టేషన్లో పని చేస్తున్నాడు)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్వారపూడిలోని పరిశ్రమలో అగ్ని ప్రమాదం

రూ.40 లక్షల ఆస్తినష్టం

మండపేట: మండలంలోని ద్వారపూడిలో గల వెట్ గ్రైండర్స్ పరిశ్రమలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.40 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్టు అంచనా. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. కెనాల్ రోడ్డులో గల గోడౌన్‌లో పుష్పలక్ష్మి ఇండస్ట్రీస్, కోవై లక్ష్మీ ఇండస్ట్రీస్‌లో పరిశ్రమను నిర్వహిస్తున్నారు. వెట్ గ్రైండర్లు, విడి భాగాలను తయారు చేస్తుంటారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. ఈ ఘటనలో యంత్ర సామగ్రి, ముడిసరకు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న అనపర్తి ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సంఘటన సమయానికి ఫ్యాక్టరీలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఏమీ కాలేదు. రోజుమాదిరి బుధవారం రాత్రి ఫ్యాక్టరీ మూసివేసి వెళ్లిపోయామని, తెల్లవారేసరికి ఈ ప్రమాదం చోటుచేసుకుందని యజమానులు బీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, దుర్గాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో రూ. 40 లక్షల నష్టం సంభవించిందని అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరి మృతి

అల్లవరం: అల్లవరం మండలం బెండమూర్లంక సెంటర్లో బుధవారం అర్ధరాత్రి ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓడలరేవు గ్రామానికి చెందిన పెమ్మాని సూర్యమోహన్ (51) మృతిచెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్.యానం ఓఎన్జీసీలో డ్రిప్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పెమ్మాని సూర్యమోహన్ విధులు ముగించుకుని మోటారు సైకిల్‌పై కొమరగిరిపట్నం మీదుగా ఓడలరేవు వెళ్తుండగా, బెండమూర్లంక నుంచి కొమరగిరిపట్నం మోటారు సైకిల్‌పై వస్తున్న యేడిద సతీష్ (20) ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితికి చేరారు. స్థానికులు 108లో అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సూర్యమోహన్ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సతీష్‌కు తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం సతీష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఎస్సై తెలిపారు. మృతుడు సోదరుడు పెమ్మాని వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, అమ్మాయి, అబ్బాయి ఉన్నారని తెలిపారు.

అనుమానా స్పద స్థితిలో పారిశుధ్య కార్మికురాలి మృతి

- ఇంట్లో మంచంపై గాయాలతో మృతదేహం
- హత్యగా అనుమానాలు

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు వేగి వెంకటలక్ష్మి(45) ఇంట్లో అనుమానస్పద స్థితి మృతి చెందడంతో ఇంద్రపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం వెంకటలక్ష్మి గ్రామంలోని తూరంగేశ్వరస్వామి ఆలయంలో పారిశుధ్య కార్మికురాలిగా 15 ఏళ్లుగా పనిచేస్తోంది. తల్లిదండ్రులు చనిపోయారు. సుమారు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగినప్పటికీ ఒంటరిగానే తనకు ఉన్న చిన్న డాబాలో నివాసం ఉంటోంది. ఇంట్లో నుంచి బుధవారం బయటకు రాకపోవడంతో పక్కింటి వారు అనుమానంతో పోలీసులకు తెలియజేశారు. బుధవారం రాత్రి 11గంటల సమయంలో పోలీసులు వెంకటలక్ష్మి ఇంటికి చేరుకుని చూడగా మృతి చెంది ఉంది. తలపై బలమైన గాయం ఉన్నట్టు గుర్తించారు. దీంతో హత్యకు గురైనట్టు భావిస్తున్నారు. మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతురాలికి వరుసకు సోదరుడయ్యే ఇంద్రపాలెం గ్రామానికి చెందిన వేగి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు అనుమానా స్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు. చోరీ కోసం వచ్చి ఎవరైనా దాడికి పాల్పడ్డారా లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది దర్యాప్తులో తేలుతుందన్నారు.

ఆస్థి వివాదంలో భార్యభర్తలపై కొడవళ్లతో దాడి

ఉప్పలగుప్తం: అన్న కుమారులు తనపైన, తన భార్యపైన కొడవళ్లతో దాడి చేశారని ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలోని ఆదిలక్ష్మీపురానికి చెందిన నాగేంద్రప్రసాద్ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఆదిలక్ష్మీపురంలో ఉమ్మడి ఆస్థి 10 ఎకరాలు చేపల చెరువుని గారపాటి రాజరావు 12 ఏళ్లుగా సాగు చేస్తూ అనుభవిస్తున్నారు. చేపల చెరువులకు రాజారావు కుమారులు గట్లు వేస్తున్న సమయంలో ఉమ్మడి ఆస్థిలో తనకి రావాల్సిన వాటాను పంచి ఇవ్వాలని తన అన్న రాజారావుని నాగేంద్రప్రసాద్ అడిగారు. అయితే రాజారావు కుమారులు ఒప్పుకోకపోవడంతో గారపాటి నాగేంద్రప్రసాద్ తనకు వచ్చే మూడు ఎకరాల భూమిలో మంగళవారం జేసీబీ సాయంతో గట్లు వేసే ప్రయత్నం చేశారు. దీంతో రాజారావు కుమారులు గారపాటి సుబ్బారావు, వీర వెంకట సత్యనారాయణమూర్తి వారితో ఘర్షణకు దిగారు. ఘర్షణ తీవ్ర రూపం దాల్చడంతో సుబ్బారావు, వీర వెంకట సత్యనారాయణ నాగేంద్రప్రసాదు, అతని భార్య అనంతలక్ష్మిపై కొడవళ్లతో దాడి చేశారు. నాగేంద్రప్రసాదుకి నుదుటిపై గాయం కాగా, భార్య అనంతలక్ష్మి పొట్ట, ఎడమ చేయి భాగాల్లో తీవ్ర గాయాలు అయ్యాయి. భార్యాభర్తలు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జి.వెంకటేశ్వరరావుతెలిపారు.

సంస్కృత పండితుడు మల్లంపల్లి కన్నుమూత



మల్లంపల్లి అమరేశ్వరప్రసాద్ (ఫైల్ ఫొటో)

కాకినాడ కల్చరల్/నల్లజర్ల: ప్రవచన కర్త, సంస్కృత పండితుడు మల్లంపల్లి అమరేశ్వరప్రసాద్ (80) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొన్నేళ్లుగా సామర్లకోట మండలం అచ్చంపేటలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈయన స్వస్థలం ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల. ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఈయన శిష్యుడు. మల్లంపల్లి ఉద్యోగ రీత్యా కాకినాడలో స్థిర పడ్డారు. స్థానిక శ్రీనగర్‌లోని నవభారత్ ఎయిడెడ్ పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయన శ్రీనాథుని కాశీఖండంను తెలుగులో అనువదించారు. అపర్ణాదేవి వ్రత మహిమ పుస్తకాన్ని రచించారు. శ్రీమద్ ఆంధ్ర మహా భాగవతాన్ని తెలుగులోకి అనువదించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంపై మంచి పట్టు సాధించారు. స్థానిక వెంకట్‌నగర్‌లో మృణాళిని విద్యాలయాన్ని స్థాపించి ఉచితంగా సంస్కృతం భాష నేర్పించేవారు. ఉపాధ్యాయ పరీక్షలకు శిక్షణ ఇచ్చేవారు. నమశ్శివాయ పంచాక్షరి కోటిసార్లు పఠించి మఠాధిపతుల నుంచి పురస్కారాలు పొందారు. సినీ దర్శకులు కె.విశ్వనాథ్‌కు ఆత్మీయుడు. సూర్యకళామందిర్‌లో 2014లో కె.విశ్వనాథ్ చేతుల మీదుగా సన్మానం పొందారు. ఈయన శివభక్తుడు, శివుని ఆరాధన లేకుండా పచ్చి మంచినీళ్లు కూడా తాగేవారు కాదని ఆయన సన్నిహితులు తెలిపారు. సుబ్రహ్మణ్య కల్యాణం, అన్నపూర్ణా కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించేవారు. ఈయన మంచి ప్రవచన కర్త అని స్థానిక సాహితీవేత్తలు కారుప్రోలు గౌరినాయుడు, జానకీరామ్‌చౌదరి, పోచినపెద్ది సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. ఈయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

గుర్తుచేసుకుంటున్న నల్లజర్ల గ్రామస్తులు

అమరేశ్వర ప్రసాద్ బాల్యం నల్లజర్ల శ్రీరామకృష్ణమఠంలోనే గడిచిందని గ్రామస్తులు అప్పటి రోజులను గుర్తుచేసుకుంటున్నారు. తండ్రి నాగభూషణశర్మతో కలసి ఇక్కడ ఉండేవారని ఆయన విద్యాభ్యాసం కూడా ఇక్కడే జరిగిందని చెబుతున్నారు. ఒక తరం మొత్తానికి నాగభూషణశర్మ ఆధ్యాత్మికత, నైతికత, సాంఘిక బోధనలు నేర్పించి గ్రామస్తులందరినీ ఆధ్యాత్మికత వైపు నడిపించారని నేటికీ అదే తీరులో గ్రామస్తులు భక్తి భావంతో నడుస్తున్నారని చెబుతున్నారు. చాగంటి వారికి ఉపదేశానుగ్రహం మల్లంపల్లి వారే చేశారని, వారి మృతి మనందరికి తీరని లోటని గ్రామపెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువు అమరేశ్వరప్రసాద్ మృతికి చాగంటి కోటేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

దారుణ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

అనపర్తి: ఇచ్చిన అప్పును వసూలు చేసే విషయంలో బాధితుడిని వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుతుకులూరుకు చెందిన తమలంపూడి వీరవెంకట సత్యనారాయణ రెడ్డి(34) ఆరు నెలలుగా అనపర్తి పాతవూరు రామాలయం సమీపంలో నివాసముంటున్నాడు. సత్యనారాయణరెడ్డి వ్యాపారం నిమిత్తం 6 సంవత్సరాల క్రితం మండలంలోని రామవరానినికి చెందిన మల్లిడి వెంకటరెడ్డి వద్ద రూ.4 లక్షలు అప్పుగా తీసుకుని రూ. 3.50 లక్షలు తిరిగి చెల్లించాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మిగిలిన అప్పును చెల్లింపులో జాప్యం జరిగింది. ఈ క్రమంలో తాను ఇచ్చిన అప్పు వడ్డీతో రూ.8 లక్షలు అయ్యిందని, చెల్లించాలంటూ సత్యనారాయణరెడ్డిని వెంకటరెడ్డి ఒత్తిడి చేయడంతోపాటు మూడు నెలలుగా వేధింపులకు గురిచేస్తూ అవమానకరంగా మాట్లాడుతున్నాడు. మనస్తాపం చెందిన సత్యనారాయణరెడ్డి ఈ నెల 4న సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్యనారాయణరెడ్డి భార్య లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్పవరంలో కోడి కత్తులు స్వాధీనం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్

కాకినాడ రూరల్: ముందస్తు సమాచారం మేరకు సర్పవరం పరిధి భావనారాయణపురంలో కోడి కత్తుల తయారీ ప్రాంతంలో గురువారం పోలీసులు దాడి చేసి భారీగా కత్తులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, సిబ్బంది జన చైతన్య లేఅవుట్, భావన్నారాయణపురం కాలువ గట్టు దగ్గర ఉన్న ఇంటి వద్ద కోడి కత్తులు తయారు చేస్తున్న శ్రీరంగం మాణిక్యంను అరెస్టు చేశారు. అతని నుంచి 506 కోడి కత్తులు, తయారీ పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయంత్రం పోలీసు స్టేషన్‌లో మీడియాతో అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న కోడికత్తులను ప్రదర్శించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

